ఎ. భారతి



# అర్హత

బస్టాపు పక్కన పిట్టగోడ మీద కోతుల్లా కూర్చును న్నారు మిత్రబృందం. ''ఇంకా కాలేజీ వదిలే టైమెంతుందిరా'' అడిగేడు గిరి.

''ఎదవా! వాచీ తాకట్టెట్టేసి సిగరెట్లు తాగేసి మమ్మల్ని కాల్చుకు తింటున్నావు గదా, ఇంకా అర గంట ఉంది వెయిట్ చేయ్'' అన్నాడు బాబ్జీ.

వాళ్ళు ముగ్గురూ సంవత్సరాల తరబడి ఇంటరూ, డిగ్రీలతో కుస్తీలు పడుతున్న నిఖార్సయిన కాలేజీ కుర్రాళ్ళు. క్లాసురూములో తక్కువ, వీధుల్లో ఎక్కువగా కాలం గడిపేస్తున్న వాళ్ళు. అంతలో వచ్చి కలిశాడు రవి. ''ఏరా పరీక్ష ఎట్టా రాసేవు'' అన్నాడు.

''ఏం పరీక్షోరా!'' రవిలో నిరాశ.

''అసలీసారి బాగానే చదివాన్రా. ఎట్టయినా ఈసారి ఇంటరు పాసయితే డిగ్రీ చేరిపోవాలని ఆశ పడ్డానా. పరీక్ష హాల్లోకెళ్లి నంబరు చూసుకుని కూర్చున్నాన్రా. సారొచ్చి ఎకనామిక్స్ పేపరిచ్చాడు. 'ఇదేంటి సార్! నేను రాయాల్సింది సివిక్స్' అన్నారా. 'లే నాయనా, నిన్నయి పోయిన పరీక్షకి ఇవాళొచ్చేవు. వెళ్లి మళ్లీ ఎగ్జామ్స్ అప్పుడొచ్చెయ్యి' అని పంపించేశాడ్రా''

అంతవరకూ సీరియస్‌గా విన్న మిత్రబృందం నవ్వుల్లో విరగబడిపోయారు.

చిరాగ్గా ఉంది రవికి. అసలెన్ని ఆశలు పెట్టుకున్నాడు ఇంటరు పరీక్ష మీద. ఇంటరయిపోతే గబగబా డిగ్రీ చదివేసి ఏ ఐయ్యేయస్సో అయిపోవాలనే ఆశయాలేం లేవు. నాలుగేళ్లుగా పాస్ కాలేని ఇంటరు పాసవుతే డిగ్రీలో చేరచ్చు. ఉద్యోగంలో చేరాలని కాదుగానీ ఇట్లా ఆవారాగా తిరుగుతున్నానని స్వప్న పట్టించుకోవడం మానేసింది ఈమధ్య.

''ఏంట్రా మరీ అంతలా ఆలోచిస్తున్నావు? అయినా ఇంటరు ఫేలవ్వడం మనకు కొత్తేముంది బాస్!'' కుదిపాడు గిరి.

''పరీక్ష గురించి కాదురా. బాధంతా స్వప్న గురించే. మరీ పురుగు లెక్క చూస్తోందిరా. పలకరిస్తే సమాధానం కూడా చెప్పట్లేదు. అసలది ఇంజనీరింగ్‌లో చేరినప్పట్నించీ గీర ఎక్కువయిపోయింది. చాలా మారిపోయింది. టెన్త్ క్లాసులో నేనంటే ఎంత ప్రేముండేదిరా. హీరో వర్షిప్పు'' వాపోయాడు రవి.

రవీ, స్వప్న చిన్నప్పట్నించీ స్నేహితులు. పిప్పరమెంట్లు పంచుకుని తినే వయసప్పట్నించీ కలిసి పక్కపక్క ఇళ్లల్లో పెరగటంతో ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. తన కోసం చెట్టెక్కి జామకాయలు కోసిచ్చే వాడని, ఎవరన్నా తననేమన్నా అంటే వాళ్లతో పోట్లాటకి దిగేవాడని రవి అంటే స్వప్న చిన్న మనసులో అభిమానముండేది. స్కర్టులూ, నిక్కర్లూ పోయి పరికిణీ, పాంట్లు వచ్చాక కూడా వాళ్ల స్నేహం కొనసాగింది. ఎప్పుడూ చక్కగా చదివే స్వప్నవే క్లాసులో ఫస్ట్ మార్కులు. వయసు పెరిగే కొద్దీ రవికి చదువు మీద శ్రద్ధ తగ్గి స్వప్న మీద ధ్యాస పెరిగింది. ఫలితంగా పదవ తరగతి ఫెయిల్ అయ్యాడు. కష్టపడి రెండోసారి అయిందనిపించి కాలేజీలో చేరాడు. కాలేజీ వాతావరణం, వయసు వేడి, కొత్త స్నేహాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. మరో చెంప స్వప్న ఎంసెట్‌లో మంచి ర్యాంకుతో ఇంజనీరింగ్‌లో చేరింది. ఎప్పుడూ ఆవారాగాళ్లతో తిరుగుతుంటాడని ఇప్పుడు రవంటే చిరాకు స్వప్నకి. ప్రస్తుతం రవిని బాధిస్తున్న సమస్యల్లా మళ్లీ స్వప్నని తన దారికి

తెమ్ముకోవడమెలా అని.

కాలేజీ వదిలినట్లుంది. రోడ్డంతా సీతాకోకచిలుకలు ఎగురుతున్నట్లు రంగులు పరుచుకున్నాయి. బస్టాపంతా కబుర్ల, నవ్వులమయంగా తయారయింది. గిరి వాళ్ళల్లో ఉత్సాహం.. మామూలుగానే నోటికి పని చెప్పారు. ''ఆ పిల్ల చూడరా! నిన్న సినిమాలో హీరోయిన్‌లాగా లేదూ''.. ''జీన్స్ పాంట్ పిల్ల మరీ లావవుతోందిరా'' అంటూ రెచ్చిపోతున్నారు.

కొందరు ఆడపిల్లలు నిరసనగా చూసి తలతిప్పుతున్నప్పుడల్లా వీళ్ళ ఉత్సాహం రెట్టింపవుతోంది.

''రవి ఏంట్రా ఏం మాట్లాడడు'' అని తిరిగి చూసిన బాబ్జీకి రవి ఇంకా గోడమీదే కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తుండడం కనిపించింది.

''సార్రీ! మనోడేంట్రా ఇంత డల్ అయిపోయాడు, ఇప్పుడేమయిందనీ'' అంటూ దగ్గరకొచ్చారు.

రవికి ఇంకా నిన్నటి సంఘటనే మనసులో మెదుల్తోంది. నిన్న స్వప్న ఎవరితోనో నవ్వుతూ వెళ్తోంది దారిలో. మండిపోయింది మనసు. అటకాయించి అడిగేడు ''ఎవరే వీడని''. తన సమాధానం కన్నా ఈసడిస్తూ తను చూసిన చూపు గుండెను కోసేస్తుంది. ఎందుకు తనకి నేనంటే అంత అసహ్యం. చిన్నప్పుడు నేనంటే ఎంత ప్రేమగా ఉండేది. మనిషిని చదువుతో తప్ప కొలవడం సాధ్యపడదా. చిన్నప్పటి ప్రేమంతా ఎలా ఆవిరయిపోయింది. నేను తన కోసం చెట్టెక్కి పడి కాలు బెణికించుకున్న రోజు ఎంత ఏడ్చింది. మరిప్పుడు నా కళ్లల్లో నీళ్లు చూసినా కరగదెందుకు. తనొప్పుకుంటే కూలీ చేసయినా తనని మహారాణిలా చూసుకుంటానని నమ్మొచ్చుగా.

''ఒరే రవీ! నువ్వు ఇంటరు పాసయినా నీది మాథ్స్ గ్రూపు కాదు. ఇంజనీరింగో మరొకటో చెయ్యలేవు. ఆ స్వప్న గోల ఒదిలేయ్‌రా'' ఉచిత సలహా ఇచ్చేశాడు బాబ్జీ.

''అయినా ఆ పిల్ల తప్ప లోకంలో ఆడపిల్లలే లేర్రా. అలా బాధపడిపోతావేటీ'' గిరిగాడి ఓదార్పు.

''అట్లా కాదురా! ఎవరో ఒకళ్లు కాదు. నేను స్వప్నని వదులుకోలేను. అయినా నీకు ప్రేమ గురించేం తెలుసు నువ్వా సలహాలిస్తున్నావు'' ఘాటుగా సమాధానం చెప్పాడు గిరికి ఈమారు. ధాంతో గిరికి రోషమొచ్చేసింది.

''ఏంట్రా అసలు నీకు తెలిసింది. నీకు ఒక్కళ్లని ప్రేమించడమే తెలుసు. నేను ఇప్పటికి 23 మందిని ప్రేమించాను తెల్సా'' అన్నాడు గొప్పగా. నవ్వాలో, ఏడవాలో తెలీని పరిస్థితి.

సిగరెట్ తీసి ముట్టించి గుండెల్నిండా పొగ పీల్చి వదిలేడు రవి. బస్టాప్ దగ్గర జనం పల్చబడ్డారు. ''స్వప్నకి నా ప్రేమ అర్థం కావాల్రా! మీరే ఏదైనా సలహా చెప్పండి. అది నిన్న వాడెవడితోనో మాట్లాడుతున్నప్పట్నించీ నాకు కడుపు మండిపోతోంది. దానికి ముందే చెప్పాను ప్రేమిస్తే నన్నే ప్రేమించాలని. నా చెయ్యి దాటిపోతోందిరా. దానికి బుద్ధి చెప్పాలి. అది నన్ను కాదని ఇంకెవర్నీ చేసుకోవడానికి లేదు.'' ఎరుపు జీరలు తేరిన రవి కళ్లలో క్రౌర్యం.

''అవున్రా ఈ ఆడపిల్లలు చదువుకోవడం దగ్గర్నించీ మనకి తిట్లు ఎక్కువైపోయాయి ఇంట్లో కూడా. ఇప్పుడేం చేద్దామని'' అడిగాడు గిరి.

''ఏదే తెలీట్లా. నాకైతే దాని మొహాన యాసిడ్ పోద్దామన్నంత కోపంగా ఉంది.''

అప్పటివరకూ నిశ్శబ్దంగా విన్న శివ ''వద్దురా! పాపం పోనీలే. అయినా గొడవలవుతాయేమోరా'' అన్నాడు.

బాబ్జీ కలిగించుకుంటూ ''ఏంట్రా గొడవలు, మన రవికేం బాలేదా, అట్లా చేసే వాళ్లకి అదే గతని తెలిస్తే మరొకతి అలా చేయదు'' ఎగదోశాడు.

రవి మనసులో అప్పటికప్పుడు నిర్ణయమైపోయింది. యాసిడ్ ఎక్కడ దొరుకుతుందో, ఏ దారిలో స్వప్నని అటకాయించాలో అన్నీ నిర్ణయమైపోయాయి. 'నన్ను కాదన్న దానికి ఇదే సరైన గుణపాఠం'

గొప్ప అడ్వెంచర్ చెయ్యబోతున్నారన్న ఉత్సాహంతో అందరూ ఇళ్లకు బయల్దేరారు.

★ ★ ★

భోజనానికి కూర్చున్నాడు రవి. తలుపువారగా వేసుండడంతో అమ్మ, నాన్నల మాటలు బెడ్రూమ్‌లో నుండి వినబడుతున్నాయి. నాన్న అంటున్నాడు. ''రేపొద్దున్నే వాళ్లొస్తారట. వాణితో చెప్పావా?'' అంటూ. అమ్మ అంటోంది- ''చెప్పానండి, కానీ చిన్నప్పట్నించీ అనుకున్న బావని కాదని వేరే సంబంధం అంటే ఏదోగా ఉంది. ఇంతకీ సుశీల ఏమనుకుంటుందో'' అని.

''అనుకోడానికేముంది. చిన్నప్పట్నుంచీ అనుకున్నామనీ, చెల్లెలు కొడుకనీ చక్కగా చదువుకున్న వాణిని ఆ జులాయికిచ్చి చేద్దామా. చదువు, సంధ్య లేకుండా వీధులు పట్టుకు తిరుగుతున్న వెధవకిచ్చి చేస్తే రేపు వాణి ఏం సుఖపడుతుంది. అసలు సుశీలే వద్దంటుందిలే. అంతగా అత్తకూతురు కావాలనుకున్నవాడు దీనికిమల్లే చదువుకుని ఉండొచ్చుగా. జీవితంలో లక్ష్యం లేని వెధవ ఏం పెట్టి పోషిస్తాడీ పిల్లని. పైగా మనం చూసిన కుర్రాడు బుద్ధిమంతుడూ, ఉద్యోగస్తుడూనూ''. తర్వాత వాళ్ల డిస్కషన్స్ పెళ్లి ఏర్పాట్లపైకి మళ్లాయి.

రవి మేడ పైకి చేరాడు. చల్లగాలికి కొబ్బరాకులు గలగల లాడుతున్నాయి. గోడపైకి పాకించిన సన్నజాజి తీగ గాలికి గంధాలద్దుతోంది. రవి మనసంతా గందరగోళంగా తయారయింది. అమ్మే నాన్న ఎందుకు వాసుని వద్దంటున్నారు. నిజంగానే వాణి వాసుతో సుఖంగా ఉండలేదా. ఏ పనీ చేతగాని వాసు ఏం పెట్టి పోషిస్తాడు. మరి వాణి ఇష్టపడిందిగా ఇప్పుడెలా మర్చిపోయింది. ఉద్యోగస్తుడిని చేసుకోబోతున్న వాణిపైన కూడా వాసు యాసిడ్ పోస్తాడా. అంత చలిలోనూ చెమటలు పట్టసాగాయి రవికి.

కింద నుండి ఎవరో వస్తున్నట్లు అడుగుల సవ్వడి. వాణి పైకొచ్చింది ''ఏంట్రా అన్నయ్యా, ఒక్కడివే ఏంచేస్తున్నావు'' అంటూ.

ఉపోద్ఘాతం లేకుండా సూటిగా అడిగేడు- ''వాసుని కాదని వేరొకళ్లని చేసుకుంటున్నందుకు బాధగా లేదా'' అని.

నవ్వేసింది వాణి.

''బాధెందుకు, చిన్నప్పుడు ఫ్రెండ్‌గా ఇష్టపడ్డాను. అందరూ వాసుతోనే పెళ్లంటే కామోసు అనుకున్నాను. అందుకే ఇష్టముండేది. అలాగని రౌడీలాగా తిరిగినా ఇష్టపడాలా. ఏ ఆడపిల్లయినా తనని ప్రేమించడమే కాదు, తను పెళ్లి చేసుకునే వాడికి అందర్లో గౌరవం ఉండాలని కోరుకోవడం తప్పెట్లా అవుతుంది'' ఎదురు ప్రశ్నించింది.

నిజమే! అందరూ ఇలానే ఆలోచిస్తున్నారు. మరి నేనొక్కడ్నే ఎందుకిలా ఉన్నాను. నా ఆలోచనల్లోనే తప్పుందా. వాణి ఆలోచన న్యాయమనిపిస్తే మరి స్వప్నదీ న్యాయమేగా. స్వప్న మొఖం గుర్తొచ్చింది. తన నవ్వు గుర్తురాగానే మనసులో ఓ సంతోషపు కెరటం. ఎప్పుడూ నవ్వుతున్నట్లుండే పెదాలు, బుగ్గన సొట్ట, మెరిసే కళ్లతో ఎంత బావుంటుంది. తన పైనా నేను యాసిడ్ పొయ్యాలనుకుంది. పక్కింటి కిటికీ వైపు చూశాడు.

ఇంకా లైట్ వెలుగుతోంది. చదువుకుంటోందిగామోసు. ఈమధ్య ఆ కిటికీ తెరవడం మానేసింది. నన్ను చూడడం కూడా ఇష్టం లేదులాగుంది. 'తొందరపాటులో ఎంత తప్పు చేయబోయాడు. ప్రేమించిన వాడ్నవుతే ప్రాణాలు తీసేంత కఠినత్వం ఎట్లా వచ్చింది. తను నవ్వితే ఎంత బాగుంటుంది. యాసిడ్ పోసుంటే ఎప్పటికీ తన నవ్వు మూగబోయుండేదేమో కదా. ఇంటర్ గట్టెక్కలేని వాడిని మహారాణిలా చూసుకుంటానంటే నమ్మేదెవరు. బలవంతంగా లాక్కోడానికి ప్రేమ వస్తువేం కాదుగా'. మెల్లగా మనసును కమ్ముకున్న మంచుతెరలు కరిగిపోతున్న భావన. ఆత్మవిమర్శలోంచి కర్తవ్యం బోధపడినట్లయింది. స్వప్న జీవితంలో కాకున్నా, మంచి ఫ్రెండ్‌గా తన మనసులో మళ్లీ చోటు సంపాదించాలి. నేను ప్రేమకు అర్హుడినేనని నిరూపించుకోవాలి. రవి మనసులో భవిష్యత్ ప్రణాళిక రూపుదిద్దుకొంటోంది. కొబ్బరాకుల మాటునుంచీ చంద్రుడు వెన్నెలగా దీవెనలు కురిపిస్తున్నాడు.

☆